నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, శనివారం 27 ఏప్రిల్ 2024 | KHAMMAM

రామవరం మాతాశిశు ఆరోగ్య కేంద్రం

సర్కార్ వైద్యంపై పట్టింపేదీ...!

- మాతాశిశు కేంద్రంలో నిండు ప్రాణాలు బలి
- తల్లీబిడ్డల ప్రాణాలకు గ్యారెంటీ నిల్
- ఐసీయూ లేదు.. బ్లడ్‌బ్యాంకు లేదు
- నిర్లక్ష్యాన్ని వీడని వైద్యులు
- కలెక్టర్ చొరవ చూపినా మారని తీరు
- పెద్దాసుపత్రిలోనూ సౌకర్యాల కొరత

వరండాలోనే నిద్రిస్తున్న బాలింతలు, వారి సహాయకులు

ప్రభుత్వ జిల్లా వైద్యశాల

తాళం వేసి ఉన్న ఎక్స్‌రే గది

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ రామవరం, ఏప్రిల్ 26 : సర్కార్ వైద్యంపై పట్టింపులేకపోవడంతో నిండుప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ప్రసవానికి వచ్చిన గర్భిణులు, పిల్లల ప్రాణాలకు గ్యారెంటీ లేకుండాపోయింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో పెద్దాసుపత్రి ఎన్నో ఏండ్లుగా సేవలందిస్తున్నది. దీనికితోడు పట్టణానికి సుమారు 5 కిలోమీటర్ల దూరంలోని రామవరంలో ఉన్న మాతాశిశు కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు ప్రత్యేకంగా వైద్యసేవలు అందుతున్నాయి. ఈ మాతాశిశు కేంద్రంలో వైద్యుల నిర్లక్ష్యం, సౌకర్యాలేమి కారణంగా నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. ప్రసవ సమయంలో తల్లీబిడ్డల ప్రాణాలకు రక్షణ లేకుండాపోతున్నది. మొన్నటివరకు వైద్యవిధాన పరిషత్ పరిధిలో ఉన్న పెద్దాసుపత్రి 'మెడికల్ కాలేజీ' రావడంతో డీఎంఈ పరిధిలోకి వెళ్లిన విషయం తెలిసిందే. ఎప్పుడైతే డీఎంఈ కంట్రోల్‌కి వెళ్లిందో నాటి నుంచి పాత క్యాడర్ అంతా ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలకు వెళ్లిపోయారు. వారిస్థానంలో కొత్తగా వచ్చిన వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో తల్లీబిడ్డలు మృత్యువాత పడుతున్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం సర్కార్ ఆసుపత్రిపై ప్రజలకు విశ్వాసాన్ని కలిగించడంతో మాతాశిశు కేంద్రానికి గర్భిణులు క్యూ కడుతున్నారు. ఈ క్రమంలో కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో వైద్యులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రోగులు భయంతో వణికిపోతున్నారు. రామవరంలో ఉన్న మాతాశిశు కేంద్రంలో సరైన సౌకర్యాలు లేక తల్లీబిడ్డలు ప్రాణాలు కోల్పోవాల్సి వస్తున్నది. గత జనవరి నెలలో సుజాతనగర్ మండలానికి చెందిన తల్లీబిడ్డ వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతిచెందిన ఘటన మరవకముందే ఈ నెల 25వ తేదీ గురువారం జూలూరుపాడు మండలానికి చెందిన మరో తల్లి బానోత్ చంద్ర పెద్దాసుపత్రిలో ప్రాణాలు విడిచింది. ఎంతో హృదయ విదారకమైన ఘటనలు సర్కార్ ఆసుపత్రిలో జరుగుతున్నా ఉన్నతాధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండడంతో జనం అసహ్యించుకుంటున్నారు.

కనీస సౌకర్యాలూ కరువు..

ఎన్నో సౌకర్యాలు కలిగి ఉండాల్సిన సర్కార్ ఆసుపత్రిలో కనీసం తాగునీరు కూడా లేదంటే నమ్మరేమో? మాతాశిశు కేంద్రంలో తాగునీరు లేక తల్లులు అల్లాడిపోతున్న ఘటనలు దర్శనమిస్తున్నాయి. నీళ్లకోసం ఆరుబయట చలివేంద్రాల వద్దకు వచ్చి తీసుకెళ్లాల్సిన దుర్భరమైన దుస్థితి. వాటర్‌కూలర్లు పనిచేయకపోవడంతో తాగునీటి సమస్య ఏర్పడింది. ఏసీలు లేకపోవడంతో ఎండాకాలం గర్భిణులు ఉక్కపోతకు నానా ఇబ్బందులు పడుతున్నారు. ఇక రోగులతో వచ్చే సహాయకులు వరండాల్లో పడిగాపులు కాస్తున్నారు. ఏదేమైనా తల్లీబిడ్డల ప్రాణాలకు గ్యారెంటీ లేకపోవడంతో తెగ భయపడిపోతున్నారు.

ఐసీయూ లేదు.. బ్లడ్‌బ్యాంక్ లేదు..

రామవరంలో ఉన్న మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో ఐసీయూ కూడా లేకపోవడం విడ్డూరంగా ఉంది. బ్లడ్ తక్కువ అయితే బ్లడ్ ఎక్కించే సౌకర్యం కూడా ఇక్కడ అందుబాటులో లేదు. దీంతో పట్టణంలోని జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్తుంటారు. డెలివరీ సమయంలో సీరియస్ అయినప్పుడు ఐసీయూ లేకపోవడం వల్ల వెంటిలేటర్ సాయం అందక మృతిచెందుతున్నారు. గతంలో, నిన్న చనిపోయిన తల్లీబిడ్డల పరిస్థితి కూడా ఇలాంటిదే. ఈ సౌకర్యంపై వైద్యులు ఎందుకు పెద్ద అధికారుల దృష్టికి తీసుకువెళ్లడం లేదో అర్థం కాని విషయం.

కలెక్టర్ చొరవ చూపినా..

జిల్లా కేంద్రంలో ఉన్న పెద్దాసుపత్రిపై కలెక్టర్ ప్రియాంక ఆల ఒకరోజు ప్రత్యేకంగా అన్ని విభాగాల వైద్యులతో సమావేశాన్ని ఏర్పాటు చేసి నిర్లక్ష్యం వీడాలని లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించినా వైద్యుల తీరులో ఏ మాత్రం మార్పు రాకపోవడం గమనార్హం. గతంలో పనిచేసిన ఆసుపత్రి సూపరింటెండెంట్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్‌కు మధ్య ఉన్న కోల్డ్‌వార్ వల్ల వైద్యుల మధ్య సఖ్యత లేదని తెలియడంతో సూపరింటెండెంట్‌పై సస్పెన్షన్ వేటు పడింది. అయినా సూపరింటెండెంట్ స్థానంలో సరైన పర్యవేక్షకులు లేకపోవడంతో మళ్లీ కథ మొదటికే వచ్చినట్లయింది. అజమాయిషీ చేయాల్సిన ప్రిన్సిపాల్ ఆసుపత్రి వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఎవరికివారే యమునా తీరేలా ఉంది. నిర్లక్ష్యం చేస్తున్న వైద్యులపై కొరఢా ఝుళిపిస్తే తప్ప సర్కారు ఆసుపత్రి గాడిలో పడదేమోనని ప్రజలు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.

వైద్యుల నిర్లక్ష్యమేమీ లేదు..

మాతాశిశులో ఇప్పటికి ఇద్దరు మాత్రమే చనిపోయారు. నిన్న చనిపోయిన తల్లి డెలివరీ సమయంలో బాగా బ్లీడింగ్ అవడం వల్ల చనిపోయారు. అలాంటి కేసులు చాలా అరుదు. వెంటిలేటర్ కూడా ఉంది. బెటర్ ట్రీట్‌మెంట్ కోసం జిల్లా ఆసుపత్రికి షిఫ్టు చేయడం జరిగింది. గైనిక్‌లు ఉన్నారు. సర్జన్‌లు ఉన్నారు. వైద్యులు కొరత లేదు. నిర్లక్ష్యం అసలే లేదు.

– డాక్టర్ రాధామోహన్, ఆసుపత్రి సూపరింటెండెంట్

మందులు బయటనే తీసుకోమంటున్నారు..

మా ఇద్దరు పిల్లలకు మలేరియా అని తేలింది. అశ్వారావుపేట నుంచి ఇక్కడికి పంపించింద్రు. ఈడికొచ్చిన తర్వాత మందుల్లేవ్ బయట తీసుకోమన్నారు. ఇద్దరికి కలిపి రూ.1500 అయ్యాయి. సర్కార్ దవాఖాన అని వస్తే మా జేబులో డబ్బులు ఖర్చు అవుతున్నాయి. ప్రైవేట్ దవాఖానలకు వెళ్లలేకనే ఇక్కడికి వచ్చాం. మా పరిస్థితిని అర్థం చేసుకోవాలి.

– అనిల్, అశ్వారావుపేట

పరిశుభ్రత లేదు

మాతాశిశు ఆరోగ్య కేంద్రంలో పరిశుభ్రత లేదు. డాక్టర్లు కూడా సమయపాలన పాటించడం లేదు. ఎప్పుడో 11గంటల తర్వాత వస్తారు. పెద్దాసుపత్రి కదా అని ఏదో ఊహించుకున్నాం. చిన్నపిల్లల మందులు కూడా అందుబాటులో లేవు. బయటి నుంచే తెచ్చుకోవాల్సి వస్తోంది. పీఐసీయూ అనేది పేరుకు మాత్రమే.. దానికి తగ్గట్టు వైద్యం లేదు. **– బీపికారాణి, కొత్తగూడెం**

రైతుబిడ్డపై పోటీకి వలసవాది

కాంగ్రెసోళ్లు హైదరాబాద్ నుంచి సూట్‌కేస్‌తో అభ్యర్థిని దింపారు
ఇక్కడి ప్రజలు ఓటుతో ఆ అభ్యర్థిని అదే సూట్‌కేస్‌తో తిప్పి పంపాలి
తెలంగాణ గొంతుక వినిపించే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి
ఇందుకోసం కారు గుర్తుపై ఓటేయండి.. కేసీఆర్‌ను ఆశీర్వదించండి
బుగ్గపాడు ఎన్నికల ప్రచారంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి నామా

రోడ్‌షోలో అభివాదం చేస్తున్న నామా

సత్తుపల్లి టౌన్, ఏప్రిల్ 26 : జిల్లా రైతుల కష్టాలు తెలిసి వాడిగా, రైతుబిడ్డగా ఉన్న తనపై పోటీకి కాంగ్రెస్ పార్టీ హైదరాబాద్ నుంచి వలసవాదిని పోటీలోకి దింపిందని ఖమ్మం పార్లమెంటు నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు విమర్శించారు. అతడు నేరుగా హైదరాబాద్ నుంచి సూట్‌కేస్‌తో ఇక్కడికి వచ్చారని అన్నారు. ఇక్కడి ప్రజల సమస్యలు, కర్షకుల కష్టాలు తెలియని అతడికి ఓటు అనే ఆయుధంతో ఇక్కడి ప్రజలు సమాధానం చెప్పాలని పిలుపునిచ్చారు. ఇందుకోసం కారు గుర్తుకు ఓటు వేయాలని కోరారు. అతడిని అదే సూట్‌కేస్‌తో హైదరాబాద్‌కు తిప్పి పంపాలని పిలుపునిచ్చారు. పార్లమెంటు ఎన్నికల ప్రచారంలో భాగంగా శుక్రవారం రాత్రి సత్తుపల్లి మండలంలో పర్యటించిన ఆయన.. బుగ్గపాడు గ్రామంలో నిర్వహించిన ర్యాలీలో మాట్లాడారు. మాయమాటలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. అది చెప్పుకున్న మేనిఫెస్టోనే అమలుచేయలేకపోతోందని విమర్శించారు. నమ్మి ఓటేసిన ప్రజలకు ఈ ప్రభుత్వం పెద్ద నష్టాన్ని చూపించిందని ఆరోపించారు. గత కాంగ్రెస్ పాలనలో రూ.200గా ఉన్న సామాజిక పింఛన్లను తెలంగాణ సాధించిన కేసీఆర్.. రూ.2,016కు పెంచారని గుర్తు చేశారు. మరి రూ.4 వేల పింఛన్ ఇస్తానన్న కాంగ్రెస్ హామీ.. నాలుగు నెలలు గడుస్తున్నా ఏమైందని ప్రశ్నించారు. రూ.15 వేల రైతు భరోసా, తులం బంగారంతో కూడిన కల్యాణలక్ష్మి, రూ.4 వేల ఆసరా పింఛన్లు, నిరుద్యోగ భృతి రూ.4 వేలు వంటి హామీలను ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల తెలంగాణకు జరిగిన నష్టాన్ని పూడ్చుకోవాలంటే ఈ పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. తెలంగాణ గొంతుకను పార్లమెంటులో వినిపించేందుకు బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపు అనివార్యం కావాలని అన్నారు. అనంతరం, బుగ్గపాడులోని కనకదుర్గమ్మ ఆలయంలో అమ్మవారికి నామా నాగేశ్వరరావు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం, సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినంత మాత్రాన ప్రజల సంక్షేమ పథకాలను ఆపడం దారుణమైన విషయమని అన్నారు. ఇన్నేళ్లుగా కేసీఆర్ ప్రభుత్వం అమలుచేసిన పథకాలను పక్కనపెట్టిన ఈ ప్రభుత్వం.. 120 రోజుల్లో తన మేనిఫెస్టో పథకాలను అమలుచేయలేక కొట్టుమిట్టాడుతోందని విమర్శించారు. గడిచిన ప్రభుత్వంలో సత్తుపల్లి నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులకు తాను శంకుస్థాపనలు చేశానని, ప్రస్తుత ప్రభుత్వం వాటన్నింటినీ నిలిపివేసిందని అన్నారు. ఇలా చేయడమంటే అభివృద్ధిని అడ్డుకోవడమేనని స్పష్టం చేశారు. ప్రస్తుత పరిస్థితులను ప్రజలు గమనించాలని, ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి కేసీఆర్‌ను ఆశీర్వదించాలని కోరారు. కాగా, భద్రాద్రి జిల్లా ములకలపల్లి నుంచి నాగుపల్లి మీదుగా బుగ్గపాడుకు చేరుకున్న నామా నాగేశ్వరరావుకు బుగ్గపాడులో బీఆర్ఎస్ నేతలు బొడ్డు శివ ఆధ్వర్యంలో వేలాది మంది కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు, డీసీసీబీ మాజీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, డీసీసీబీ డైరెక్టర్ చల్లగుళ్ల కృష్ణయ్య, బీఆర్ఎస్ నాయకులు యాగంటి శ్రీను, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, దొడ్డా శంకర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సండ్ర వెంకటవీరయ్య

రోడ్‌షోకు తరలివచ్చిన ప్రజలు

ఓట్ల లెక్కింపునకు పక్కా ఏర్పాట్లు

ఎన్నికల పరిశీలకులు డాక్టర్ సంజయ్ జి.కోల్టే, చరణ్‌జిత్ సింగ్

ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకులు

ఖమ్మం/మామిళ్లగూడెం, ఏప్రిల్ 26 : పార్లమెంట్ ఎన్నికల ఓట్ల లెక్కింపునకు పక్కా ఏర్పాట్లు చేయాలని, ఎక్కడా సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని ఎన్నికల సాధారణ పరిశీలకులు డాక్టర్ సంజయ్ జి.కోల్టే, చరణ్‌జిత్ సింగ్ అధికారులకు సూచించారు. పొన్నెకల్‌లోని శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేయనున్న ఓట్ల లెక్కింపు కేంద్రాలు, స్ట్రాంగ్ రూమ్‌ల ఏర్పాటు పనులను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వీపీ గౌతమ్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్‌లతో కలిసి శుక్రవారం వారు సందర్శించారు. కౌంటింగ్ గదులు, పార్కింగ్ తోపాటు భద్రతాపరమైన అంశాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. ఓట్ల లెక్కింపు టేబుళ్ల కూర్పు, అధికారులు, అభ్యర్థులు, ఏజెంట్ల ప్రవేశం, ఈవీఎంల నిర్వహణపై సూచనలు ఇచ్చారు. సీసీ కెమెరాలు, లైటింగ్, బారికేడ్లు, మీడియా సెంటర్ వద్ద అన్ని వసతులు కల్పించాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ లెక్కింపునకు చేపట్టిన చర్యలను పరిశీలించారు. స్ట్రాంగ్ రూమ్‌లలో ఈవీఎంల భద్రతకు ఏర్పాటు చేసిన ర్యాక్‌లను పరిశీలించి.. ఆయా సెగ్మెంట్ల ఈవీఎంలు పట్టేంత సంఖ్యలో ఏర్పాటు చేయాలన్నారు. జనరేటర్, అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. అక్కడి ఏర్పాట్లపై జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ పరిశీలకులకు వివరించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణా సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, యువరాజ్, మిర్నల్ శ్రేష్ఠ, శిక్షణ ఐపీఎస్ పి.మౌనిక, డీఆర్వో రాజేశ్వరి, ఆర్డీవోలు గణేశ్, రాజేందర్, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ శ్యామ్‌ప్రసాద్, ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ సురేందర్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి శ్రీలత పాల్గొన్నారు.

16 సెట్ల నామినేషన్లు తిరస్కరణ

మామిళ్లగూడెం, ఏప్రిల్ 26 : ఖమ్మం పార్లమెంట్ స్థానానికి స్వీకరించిన నామినేషన్లలో 16 సెట్లను వివిధ కారణాలతో తిరస్కరించినట్లు ఖమ్మం జిల్లా కలెక్టర్, రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 18 నుంచి 25 వరకు కొనసాగిన నామినేషన్ల స్వీకరణ ప్రక్రియలో మొత్తం 45 మంది అభ్యర్థులు 72 సెట్ల నామినేషన్ పత్రాలను అందించారని తెలిపారు. వాటిలో 16 సెట్ల నామినేషన్ పత్రాలను వివిధ కారణాలతో తిరస్కరించామని, 56 పత్రాలను అంగీకరించామని పేర్కొన్నారు. విత్‌డ్రా తర్వాత పోటీలో ఉండే అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తామని తెలిపారు.

మహబూబాబాద్‌లో ఐదు...

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 26 : మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గానికి స్వీకరించిన దరఖాస్తులలో ఐదు తిరస్కరణకు గురికాగా.. 25 మంది అభ్యర్థుల నామినేషన్లకు ఆమోదం తెలిపినట్లు జిల్లా ఎన్నికల అధికారి, మహబూబాబాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ తెలిపారు. వివిధ పార్టీలు, స్వతంత్ర అభ్యర్థులు మొత్తం 30 మంది నామినేషన్లు దాఖలు చేయగా శుక్రవారం స్క్రూటిని నిర్వహించినట్లు పేర్కొన్నారు.

పూర్తయిన ర్యాండమైజేషన్

ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్

మామిళ్లగూడెం, ఏప్రిల్ 26 : పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి పోలింగ్ సిబ్బంది రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు ఖమ్మం కలెక్టర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీపీ గౌతమ్ తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో కలెక్టర్.. ఎన్నికల సాధారణ పరిశీలకుడు డాక్టర్ సంజయ్ జి.కోల్టేతో కలిసి రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ర్యాండమైజేషన్‌లో అసెంబ్లీ సెగ్మెంట్ల కేటాయింపు ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలో మొత్తం 1,459 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వీటికి ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్ అధికారి, ఓపీఓలను కేటాయించామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం 20 శాతం అదనంగా సిబ్బందిని కేటాయించామన్నారు. ఖమ్మం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలోని 355 పోలింగ్ కేంద్రాలకు, పాలేరు 290, మధిర 268, వైరా 216, సత్తుపల్లి సెగ్మెంట్ పరిధిలోని 294 పోలింగ్ కేంద్రాలకు పారదర్శకంగా ఎన్ఐసీ సాఫ్ట్‌వేర్ వినియోగిస్తూ ఆన్‌లైన్‌లో ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు బి.సత్యప్రసాద్, డి.మధుసూదన్‌నాయక్, ఖమ్మం నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, శిక్షణ సహాయ కలెక్టర్లు మయాంక్ సింగ్, మిర్నల్ శ్రేష్ఠ, డీఆర్వో రాజేశ్వరి, డీఈవో సోమశేఖర శర్మ, కలెక్టరేట్ ఏవో అరుణ తదితరులు పాల్గొన్నారు.

భద్రాద్రి కొత్తగూడెంలో...

భద్రాద్రి కొత్తగూడెం, ఏప్రిల్ 26 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు సంబంధించి పోలింగ్ సిబ్బందికి రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేశామని భద్రాద్రి కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. శుక్రవారం ఐడీవోసీలోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాంకుమార్ గోపాల్‌తో కలిసి ఎన్ఐసీ రూపొందించిన స్టాఫ్‌వేర్ ద్వారా ఆన్‌లైన్‌లో పోలింగ్ సిబ్బందికి రెండో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని కొత్తగూడెం, ఇల్లెందు, పినపాక, భద్రాచలం, అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో 962 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయన్నారు. 9 యాక్సిలరీ పోలింగ్‌స్టేషన్ల ప్రపోజల్ కోసం రాష్ట్ర ఎన్నికల అధికారికి నివేదిక పంపించామన్నారు. రెండో విడత ర్యాండమైజేషన్ ప్రక్రియలో భాగంగా 1,162 మంది ప్రిసైడింగ్, 1,162 మంది అసిస్టెంట్ ప్రిసైడింగ్ అధికారులు, 2,324 మంది ఓపీవోలను కేటాయించామన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం అదనపు సిబ్బందిని కేటాయిస్తున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఎన్నికల విభాగం సూపరింటెండెంట్ దారా ప్రసాద్, ఎన్ఐసీ డీఐవో సుశీల్‌కుమార్, డీఎల్ఎంటీ పి.సాయికృష్ణ, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఖమ్మం కలెక్టర్ గౌతమ్

మాట్లాడుతున్న భద్రాద్రి కలెక్టర్ ప్రియాంక ఆల

కాంగ్రెస్ ప్రభుత్వంపై వ్యతిరేకత మొదలైంది

- హామీల అమలులో ఆ పార్టీ పాలకులు పూర్తిగా విఫలమయ్యారు
- ఎంపీ స్థానాల్లో మాదిగలకు ఒక్క సీటూ ఇవ్వలేని దౌర్భాగ్యం
- కాంగ్రెస్‌పై ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు విమర్శలు

మాట్లాడుతున్న ఖమ్మం జడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

బోనకల్లు, ఏప్రిల్ 26: అధికారంలోకి వచ్చి నాలుగున్నర నెలలు గడవక ముందే కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని ఖమ్మం జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిన ఆ పార్టీ.. ఇప్పుడు పార్లమెంటు ఎన్నికల్లో డబ్బు ఎర చూపి ఓట్లను దండుకోవాలని చూస్తోందని దుయ్యబట్టారు. బోనకల్లు మండలం రాయన్నపేట గ్రామంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ చేస్తున్న మోసాలను ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారని అన్నారు. అలాగే, హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. బీఆర్ఎస్‌లో సీట్ల కేటాయింపులో పార్టీ అధినేత ఎప్పుడూ కేసీఆర్ సమతుల్యం పాటిస్తూనే ఉన్నారని, ఈ ఎన్నికల్లోనూ దాన్ని కొనసాగించారని అన్నారు. కానీ కాంగ్రెస్ మాత్రం భిన్నంగా వ్యవహరించిందని విమర్శించారు. ఈ పార్లమెంటు ఎన్నికల్లో కేవలం రెడ్డి సామాజిక వర్గానికి మాత్రమే ఎక్కువ సీట్లు సీట్లు కేటాయించిందని, మాదిగలకు కనీసం ఒక్క సీటు కూడా కేటాయించకపోవడం దౌర్భాగ్యమని అన్నారు. జిల్లాకు చెందిన మంత్రులు కూడా ప్రజల సమస్యలను, హామీలను పక్కనబెట్టి.. తమ కుటుంబ సభ్యులకు ఎంపీ టికెట్లు తెచ్చుకునేందుకు పైరవీలు చేసుకున్నారని విమర్శించారు. వీటన్నింటినీ ప్రజలు గమనిస్తూనే ఉన్నారని అన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు నిత్యం అప్రమత్తంగా ఉండి కాంగ్రెస్ మోసాలను ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. ప్రతి కార్యకర్తా సైనికుడిలా పనిచేసి బీఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావును అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు పాటుపడాలని కోరారు. బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచారంలో భాగంగా మండలంలో రెండు చోట్ల రోడ్‌షోలు నిర్వహించనున్నట్లు వివరించారు. బీఆర్ఎస్ నాయకులు చేబ్రోలు మల్లికార్జునరావు, మోదుగుల నాగేశ్వరరావు, వేముల ప్రసాద్, జంగా రవికుమార్, ఇటికాల శ్రీనివాసరావు, జెర్రిపోతుల రవీందర్, హనుమంతరావు, కాకాని శ్రీనివాసరావు, చెల్లి ప్రసాద్, ఉయ్యూరు రాధాకృష్ణ, తోటపల్లి సాయి, గద్దల వెంకటేశ్వర్లు, వెంగళ కనకయ్య, రామమడుగు నరేశ్, షేక్ హుస్సేన్ పాల్గొన్నారు.

ప్రలోభాలకు గురిచేస్తే చర్యలు

భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు

చెక్‌పోస్టును సందర్శించిన ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం క్రైం, ఏప్రిల్ 26 : పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లను ప్రలోభాలకు గురిచేసే చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని భద్రాద్రి ఎస్పీ బిరుదరాజు రోహిత్ రాజు హెచ్చరించారు. లక్ష్మీదేవిపల్లి మండలం ఇల్లెందు క్రాస్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఓటర్లను ప్రభావితం చేసేందుకు అక్రమంగా నగదు, మద్యం తరలించే అవకాశం ఉన్నందున ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఎస్పీ వెంట ట్రైనీ ఐపీఎస్ విక్రమ్ సింగ్, చుంచుపల్లి సీఐ రాయల వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవిపల్లి ఎస్సై గన్‌రెడ్డి రమణారెడ్డి ఉన్నారు.

తనిఖీలు ముమ్మరం చేయాలి

ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాంకుమార్

చెక్‌పోస్ట్‌ను పరిశీలిస్తున్న రాంకుమార్

భద్రాచలం, ఏప్రిల్ 26 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్ట్‌ల వద్ద పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేసి.. ముమ్మర తనిఖీలు చేపట్టాలని ఎన్నికల వ్యయ పరిశీలకుడు రాంకుమార్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని నాలుగు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్ట్‌లను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిజిస్టర్లను పరిశీలించడంతోపాటు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెక్‌పోస్ట్‌ల వద్ద విధులు నిర్వర్తించే సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. పక్క రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం, డబ్బు, ఇతర బహుమతులను తరలించినట్లైతే వెంటనే పట్టుకోవాలన్నారు. అభ్యర్థులు ఖర్చు చేసే ప్రతి రూపాయిని వ్యయ పరిశీలకుల బృందాలు పకడ్బందీగా నమోదు చేయాలన్నారు. ప